సాక్షి
కుమురం భీం
మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



ప్రచారం బంద్.. ప్రలోభాలు షురూ
సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం ముగిసింది. ఈ సారి ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ప్రధాన సంఘాలు ప్రలోభాలకు తెరలేపాయి. 8లో▸



నో ఏటీఎం
నగదు విత్‌డ్రా చేసేందుకు ఒక్క ఏటీఎం కేంద్రం కూడా తిర్యాణి మండలంలో లేదు. రైతులతోపాటు సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.0 /15.4

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. చలి ప్రభావం కొనసాగుతుంది. ఏజెన్సీలో పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వాజ్‌పేయికి నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీకి స్వాగతం పలుకుతున్న మహిళ

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మండలంలోని పెద్ద కరంజివాడ గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. స్థానిక నాగోబా ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అనార్‌పల్లి వాగుపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వర్షాకాలంలో కనీసం వాగు దాటలేని పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు నీరు లేకపోవడంతో వ్యవసాయం భారమవుతుందని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ.. అధికారులతో మరోసారి మాట్లాడి నిధుల మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరి వికాస్ పథకంలో బోరుబావులు ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. అంతకు ముందు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

'దుష్ట సంఘాలను తరిమికొట్టాలి'




మేనిఫెస్టో పత్రాన్ని అందిస్తున్న నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి మనుగడ సాధించాలంటే దుష్ట సంఘాలను తరిమికొట్టాలని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నరేందర్ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ, జీఎం కార్యాలయం, డిస్పెన్సరీల్లో సోమవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లకు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఏరియాలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా పని చేసిన ఏఐటీయూసీ, టీబీజీకేఎస్‌లు క్వార్టర్ల కేటాయింపు, డిప్యూటేషన్ల పేరుతో కార్మికుల అరిగోస పెట్టాయని ఆరోపించారు. ఆ యూనియన్ల నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఐఎన్‌టీయూసీ వైపే చూస్తున్నారని స్పష్టం చేశారు. కరోనా సమయంలో ఐఎన్‌టీయూసీ పోరాట ఫలితంగా కరోనా కిట్లు, ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. కార్మికుల కష్టాన్ని దోచుకోవడమే తప్పా టీబీజీకేఎస్, ఏఐటీయూసీ కార్మికులకు చేసింది శూన్యమేనన్నారు. కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కేంద్ర కమిటీ నాయకులు ప్రకాశ్‌రావు, నాయకులు చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్.. హై కాస్ట్!

- వీధి దీపాల(హైమాస్ట్) ఏర్పాటులో ప్రమాణాలకు తిలోదకాలు
- కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ప్రజాధనం లూటీ
- రూ.20 వేల నాసిరకం పరికరాలకు రూ.2 లక్షల బిల్లులు
- అక్రమంగా రూ.5.22 కోట్ల నిధులు కాజేసేందుకు ప్రణాళిక
- మొత్తం రూ.6.40 కోట్ల బిల్లుల చెల్లింపులకు సిద్ధమవుతున్న అధికారులు



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ ఎల్ఈడీ లైట్



బేస్‌మెంట్‌పై పోల్స్‌ను ఇలా బిగించాలి..

సాక్షి, ఆసిఫాబాద్: కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ప్రజాధనాన్ని దోచుకుంటున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో వీధి దీపాల(హైమాస్ట్ ఎల్ఈడీ లైట్స్) ఏర్పాటులోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నాసిరకం పరికరాలతో పోల్స్ ఏర్పాటు చేసి నిధులు కాజేస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. జిల్లాలో 15 మండలాలు ఉన్నాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 10 మండలాలు ఉన్నాయి. ఇందులో సుమారు 3 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత జిల్లా పరిషత్ అధికారులదే. ఇందులో వీధి దీపాలు కూడా ముఖ్యమే. దీనిని సాకుగా చూపి ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వీధి దీపాల ఏర్పాటులో అవినీతికి తెరతీశారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) నిధులతో ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని ఆసిఫాబాద్, జైనూర్, కెరమెరి, లింగాపూర్, రెబ్బెన, సిర్పూర్(యూ), వాంకిడి మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో హైమాస్ట్ ఎల్ఈడీ లైట్లను ఏర్పాటుకు జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు శ్రీకారం చుట్టారు. మొత్తం 152 గ్రామ పంచాయతీల్లో 290 చోట్ల ఈ ఎల్ఈడీ లైట్ పోల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ.6.40 లక్షలు ఖర్చు చేసినట్లు బిల్లులు రూపొందించారు.

రూ.2 లక్షల బిల్లు..!?

వీధి దీపాల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం నెలకొంది. కొత్త లైట్‌పోల్స్ ఎస్ఎస్ఆర్ ప్రకారం ఏర్పాటు చేయడం లేదు. దీపాల కోసం గాల్వనైజ్డ్ ఐరన్(జీఐ) పోల్‌ను వినియోగించాలి. ఇందుకోసం నాలుగు అడుగుల గుంత తవ్వి ఐరన్‌రాడ్స్‌తో కాంక్రీట్ వేసి బేస్‌మెంట్ నిర్మించాల్సి ఉంటుంది. ఆ పిల్లర్‌పై జీఐ పోల్‌ను బిగించాలి. ఆ తర్వాత పైపు పైన నాలుగు దీపాల(ఎల్ఈడీ బల్బు)ను అమర్చుతారు. నాణ్యమైన పరికరాలను ఉపయోగిస్తే ఒక్కో పోల్‌కు రూ.35 వేల వరకు ఖర్చవుతుంది. కానీ ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ ఎల్ఈడీ లైట్ పోల్స్‌ను నాసిరకం పరికరాలు ఉపయోగించడం గమనార్హం. జీఐ పోల్ కాకుండా నాసిరకం ఎంఎస్ పోల్(మైల్డ్ స్టీల్)ను వినియోగించారు. బేస్‌మెంట్ కూడా ఐరన్‌రాడ్లు వినియోగించకుండా కేవలం పీవీసీ పైపులో కంకర పోసి పోల్ బిగించారు. ఇందుకుగాను రూ.20 వేల లోపు ఖర్చు పెట్టినట్లు తెలుస్తోంది. బిల్లుల్లో మాత్రం ఒక్కో హైమాస్ట్ ఎల్ఈడీ లైట్‌పోల్ ఏర్పాటుకు రూ.2 లక్షలు ఖర్చు అయినట్లు చూపడం గమనార్హం. ఒక్కో పోల్‌పై కాంట్రాక్టర్, అధికారులు కలిసి రూ.1.80 లక్షలు అదనంగా బిల్లులు పెట్టినట్లు సమాచారం. మొత్తం 290 పోల్స్ ఏర్పాటుకుగాను రూ.5.22 కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు పథక రచన చేసినట్లు తెలుస్తోంది.

నాణ్యతపై పట్టింపు కరువు

నామినేషన్ పద్ధతిన పనులు అప్పగించడంతో అనంతరం జరిగే పరిణామాలపై అధికారులు దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. కాంట్రాక్టర్ నిబంధనల మేరకు వీధి దీపాలకు చెందిన మెటీరియల్ వినియోగించాడా? లేదా? అన్న దానిపై పట్టించుకోవడం లేదు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో హైమాస్ట్ ఎల్ఈడీ లైట్ల పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ నాసిరకం సామగ్రిని ఉపయోగించి పోల్స్ ఏర్పాటు విషయంలో మమ అనిపించాడన్న ఆరోపణలు ఉన్నాయి. అయినా అధికారులు ఆ కాంట్రాక్టర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోగా.. వెనకేసుకొస్తుండటం విమర్శలకు దారితీస్తోంది. బేస్‌మెంట్, పోల్, వైరింగ్, ఎల్ఈడీ లైట్లకు మొత్తం రూ.1.60 లక్షల వరకు ఖర్చవుతుందని అధికారులు లెక్కలేస్తున్నా.. వాస్తవానికి కాంట్రాక్టర్ రూ.20 వేల లోపు మాత్రమే ఖర్చు చేసినట్లు సమాచారం. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై అడ్డగోలు లెక్కలతో ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

టెండరు ప్రక్రియ నుంచే..

ఏదైనా పని విలువ రూ.కోట్లలో ఉంటే వాటి ఏర్పాటుకు టెండరు ప్రక్రియ నిర్వహిస్తారు. కానీ హైమాస్ట్ ఎల్ఈడీ పోల్స్ ఏర్పాటులో ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి టెండర్ ప్రక్రియ నుంచే అవినీతికి తెరతీశారు. రూ.6.40 కోట్ల విలువైన పనులకు ఎలాంటి టెండర్లు పిలవలేదు. కేవలం నామినేషన్ పద్ధతిన ఈ పనులను గ్రామ పంచాయతీల వారీగా కట్టబెట్టడం విశేషం. వాస్తవానికి టెండర్లు పిలిస్తే తక్కువ కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తారు. ఇక్కడ మాత్రం నామినేషన్ పద్ధతిన ఒక్కో పనిని రూ.2 లక్షల అంచనాతో గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రజాప్రతినిధి సూచించిన వ్యక్తులకు ఎంపీడీవోలు అప్పగించారు. గతంలో తిర్యాణి మండలంలో 66 పోల్స్ ఏర్పాటు చేయగా.. ఓ బోర్‌వెల్ నిర్వాహకుడికి ఈ పనులు అప్పగించడం గమనార్హం. ప్రస్తుతం కూడా 8 మండలాల పనులను జిల్లా పరిషత్ ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరుడికే అప్పగించినట్లు సమాచారం.

విచారణ చేపడతాం

"హైమాస్ట్ ఎల్ఈడీ లైట్‌పోల్స్ ఏర్పాటు విషయంలో వినియోగిస్తున్న సామగ్రి నాణ్యతపై విచారణ చేపడతాం. ప్రమాణాల మేరకు బేస్‌మెంట్ నిర్మాణం జరిగిందా? లేదా? అనేది పరిశీలిస్తాం. అలాగే పోల్స్‌కు వినియోగిస్తున్న ఐరన్ నాణ్యతపై నివేదిక కోరతాం. అక్రమాలు జరిగినట్లు రుజువైతే ఎవరినీ ఉపేక్షించేది లేదు."

– అజ్మీరా కృష్ణ, డీఈ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ

'గుర్తింపు' ఎవరికో !

- ముగిసిన కార్మిక సంఘాల ప్రచారం
- చివరి రెండ్రోజులు హోరాహోరీ
- ఈసారి అన్ని సంఘాలకు ప్రతిష్టాత్మకం



ఎన్నికలకు సిద్ధం చేసిన బ్యాలెట్ బాక్సులు

ఏరియాల వారీగా ఓటర్లు	
శ్రీరాంపూర్ 9124	
మందమర్రి 4876	బెల్లంపల్లి 985

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సింగరేణి కార్మిక గుర్తింపు సంఘ ఎన్నికల ప్రచారం సోమవారంతో ముగిసింది. కోర్టులో విచారణలు, తీర్పుల మధ్యే కార్మిక సంఘాల ఎన్నికల ప్రచారం పూర్తయింది. ఈ నెల 27న ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో బరిలో నిలిచిన కార్మిక సంఘాలు హోరాహోరీగా గత వారం రోజులుగా ప్రచారం చేశాయి. ఈసారి కార్మిక సంఘాలు పొత్తులు లేకుండానే ఒంటరిగానే బరిలో దిగాయి. గత ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు తెచ్చుకుని గుర్తింపు సంఘంగా ఉన్న బీఆర్ఎస్ అనుబంధ సంఘం టీబీజీకేఎస్ ఈసారి ఇబ్బందుల్లో పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభావంతో ఆ ప్రభావం కార్మిక క్షేత్రంలోనూ పడింది. మరోవైపు మంచిర్యాల జిల్లా పరిధిలో మూడు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలవడంతో ఆ సంఘ నాయకులు ఆందోళనలో పడ్డారు. దీంతో కీలక నాయకులు ఆ సంఘానికి రాజీమానా చేశారు. అంతేకాక పోటీపై తర్జనభర్జనలు జరిగాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ, సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ మధ్యే ప్రధాన పోరు సాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో స్థానిక ఎమ్మెల్యేలు బొగ్గు గనులపై ప్రచారం చేశారు. శ్రీరాంపూర్ పరిధిలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మందమర్రి ఏరియాలో వివేక్, బెల్లంపల్లి పరిధిలో వినోద్ ఐఎన్టీయూసీని గెలిపించాలని కోరారు. మొదటగా ఎన్నికల ప్రారంభం నుంచి రాజకీయ నాయకులు ప్రచారం కోసం గనులపై రాలేదు. చివరి రెండు రోజులు మాత్రమే పాల్గొన్నారు. ఇక సీఐటీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ తదితర సంఘాలు గనులపై విస్తృతంగా ప్రచారం చేశాయి. తమనే గెలిపించాలని అనేక హామీలు ఇచ్చాయి.

సర్వత్రా ఆసక్తి

ఆరేళ్ల తర్వాత జరుగుతున్న గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో ఈసారి ఎవరికి ఆ అవకాశం దక్కుతుందోనని ఆసక్తి సర్వత్రా నెలకొంది. వరసగా రెండు పర్యాయాలు గుర్తింపు సంఘంగా కొనసాగిన టీబీజీకేఎస్ ఈసారి బలహీన పడడంతో పోటీలో నామమాత్రంగా మారింది. ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత కార్మికులు తమ సంఘాన్ని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యేలు గనులపై వస్తే, మరింత వ్యతిరేకత వస్తుందనే వాదనతో అటువైపు చూడడం లేదు. 2017లో జరిగిన గుర్తింపు ఎన్నికల సమయంలో అప్పటి పెద్దపల్లి ఎంపీగా ఉన్న బాల్క సుమన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేలందరూ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో ఆ సంఘ నాయకులే రాజీనామాలు చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్టీయూసీ సంఘం హుషారుతో ఉంది. రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రావడంతో కార్మికులు తమవైపే ఉన్నారనే నమ్మకంతో ఉన్నారు. అంతేకాక ముగ్గురు ఎమ్మెల్యేల గెలుపులో కార్మికుల ఓట్లు ఉండడంతో సింగరేణి కార్మిక గుర్తింపు సంఘ ఎన్నికల్లోనూ తమవైపే ఉంటారనే ఆశలు పెట్టుకున్నారు. ఇక ఎన్నికల నిర్వహణ కోసం పట్టుబట్టి కోర్టు మెట్లెక్కి కొట్లాడిన ఏఐటీయూసీ సైతం గట్టిగానే గెలుపు కోసం పోరాటం చేస్తోంది. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల అనుబంధ కార్మిక సంఘాలను గెలిపిస్తే ప్రయోజనం ఉండదనే వాదనను గనులపై బలంగా వినిపిస్తున్నారు. కార్మికులకు తమతోనే మేలు జరుగుతుందని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మిగతా హెచ్ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూసీ తదితర సంఘాలు సైతం 'గుర్తింపు' తెచ్చుకునేందుకు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నాయి. వీలైనంతగా కార్మికుల ఓట్లు రాబట్టేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నాయి. ఈ క్రమంలో ఈసారి ఏ సంఘాన్ని గని కార్మికులు తమ ప్రాతినిధ్య సంఘంగా ఎన్నుకుంటారనేది మరో రెండు రోజుల్లో తేలనుంది.

'ప్రజా పాలన'కు అధికారుల నియామకం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించే ప్రజా పాలన కార్యక్రమానికి మండలాల వారీగా ప్రత్యేకాధికారులను నియమించినట్లు కలెక్టర్ హేమంత్ బోర్కడే తెలిపారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మండలాలకు కె.సురేశ్(ఆర్డీవో)ను నియమించగా.. బెజ్జూర్‌కు వెంకటేశం(డీహెచ్ఎస్‌వో), చింతలమానెపల్లి కుటుంబరావు(అడిషనల్ డీఆర్‌డీవో), దహెగాం విజయ్ కుమార్(ఏడీ, ఫిషరీస్), జైనూర్ గుణవంత్‌రావ్(ఈఈ ఇరిగేషన్), కాగజ్‌నగర్ శ్రీనివాస్‌రావు(డీఏవో), కెరమెరి శ్రీనివాస్(అదనపు డీఆర్‌డీవో), కౌటాల సురేందర్(డీఆర్‌డీవో), లింగాపూర్ సురేష్(డీవీఏహెచ్‌వో), పెంచికల్‌పేట్ రామకృష్ణ(ఏపీడీ), రెబ్బెన ప్రభాకర్(ఈఈ పీఆర్), సిర్పూర్(టి) సురేశ్‌బాబు(డీఎల్‌పీవో), సిర్పూర్(యూ) వెంకటపతి(ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్), తిర్యాణి రమాదేవి(డీటీడీవో), వాంకిడి షేక్ మహమూద్(ఆడిట్ అధికారి), ఆసిఫాబాద్‌కు తారామణి(డీఎస్‌వో)ను నియమించారు.

సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేయాలి



మాట్లాడుతున్న వీరయ్య, పక్కన పార్టీ నాయకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య
- ఆసిఫాబాద్‌లో సీపీఎం జిల్లా ప్లీనరీ

ఆసిఫాబాద్‌అర్బన్: నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా పని చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సీపీఎం జిల్లా ప్లీనరీకి ఆయన హాజరయ్యారు. పార్టీ జెండా ఆవిష్కరించి సమావేశాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలుకు సీపీఎం పార్టీ సభ్యులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని కుమురంభీం ప్రాజెక్టు కాలువలు పూర్తికాక ముందే కూలిపోయే పరిస్థితికి వచ్చిందని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు, జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పాటునందించాలని కోరారు. మెడికల్ కళాశాలలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ తోపాటు జిల్లా ఆస్పత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు. మారుమూల గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యేలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు గొడిసెల కార్తీక్, ముంజం శ్రీనివాస్, ఆనంద్‌కుమార్, రాజేందర్, రాజ్‌కుమార్, నాయకులు మల్లయ్య, టీకానంద్ పాల్గొన్నారు.

చివరి దశకు 'గుర్తింపు' సమరం

- రేపు ఎన్నికలు.. రాత్రి ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యాజమాన్యం
- బెల్లంపల్లి ఏరియాలో ఐదు పోలింగ్ కేంద్రాలు



బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయం

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో ఏడో దఫా నిర్వహించనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియ చివరి దశకు చేరింది. ఎన్నికల నిర్వహణకు యాజమాన్యం ఏర్పాట్లు పూర్తి చేసింది. కొన్ని రోజులుగా గనులు, డిపార్టుమెంట్లలో కార్మిక సంఘాల నాయకులు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించి కార్మికులను ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడ్డారు. ఒక సంఘంపై మరో సంఘం నేతలు విమర్శలు, ప్రతి విమర్శలతో అసెంబ్లీ ఎన్నికలకు తీసిపోని రీతిలో ప్రచారం చేశారు. తమ హయాంలో కార్మికులకు కల్పించిన హక్కులను మరోసారి గుర్తు చేస్తూ.. ఎన్నికల్లో గెలిస్తే సాధించే హక్కులు, కల్పించే వసతులపై ప్రచారాన్ని హోరెత్తించారు. కార్మికుల కటాక్షం ఏ సంఘంపై ఉంటుందో ఎన్నికల్లో తేలనుంది.

975 మంది కార్మికులు

బెల్లంపల్లి ఏరియాలో ప్రస్తుతం కొనసాగుతున్న ఖైరిగూడ ఓసీపీ, బీపీఏ ఓసీపీ– 2, గోలేటి సీహెచ్‌పీతోపాటు వివిధ డిపార్టుమెంట్లలో కలిపి మొత్తం 975 మంది పర్మినెంట్ కార్మికులు పని చేస్తున్నారు. ఒకప్పుడు దాదాపు 10వేల మంది కార్మికులతో ఓ వెలుగు వెలిగిన బెల్లంపల్లి కాలక్రమేణా ఒక్కో గని మూతపడుతూ రాగా కార్మికుల సంఖ్య దాదాపు 10రెట్లు తగ్గింది. ప్రస్తుతం ఖైరిగూడ ఓసీపీలో మాత్రమే బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నెల 27న సింగరేణి వ్యాప్తంగా నిర్వహించే గుర్తింపు ఎన్నికల కోసం బెల్లంపల్లి ఏరియా అధికారులు ఐదు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఖైరిగూడ ఓసీపీ క్యాంటీన్, బీపీఏ ఓసీపీ క్యాంటీన్, గోలేటి టౌన్‌షిప్‌లోని పీఎంఈ సెంటర్, గోలేటి సీహెచ్‌పీ క్యాంటీన్‌లతోపాటు బెల్లంపల్లి పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సారి కూడా బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. బ్యాలెట్ బాక్స్‌లను ఇప్పటికే సిద్ధం చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు కొనసాగుతాయి. అదేరోజు సాయంత్రం 7 గంటల నుంచి గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడతారు.

తటస్థ కార్మికులు ఎటువైపో..

హోరాహోరీగా ప్రచారం చేపట్టినా ఏ కార్మిక సంఘంతో సంబంధం లేకుండా తటస్థంగా ఉండే కార్మికులు ఎవ్వరికి మద్దతు తెలుపుతారో తెలియడం లేదు. గతంతో పోల్చితే ఈసారి గుర్తింపు ఎన్నికలు రసవత్తంగా మారాయి. ప్రత్యేక రాష్ట్రంలో మొదటిసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ ఈసారి ఎలాగైనా సింగరేణి ఎన్నికల్లో జెండా పాతాలని ఉవ్విళ్లూరుతోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన టీబీజీకేఎస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అధినాయకత్వం మూకుమ్మడిగా రాజీనామాలు చేయటంతో కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. ఏరియా నాయకులు సైతం చేతులెత్తేసి ఇతర యూనియన్లకు అంతర్గతంగా మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

గత సంప్రదాయం కొనసాగేనా..?

సింగరేణి గుర్తింపులు ఎప్పుడు జరిగిన బెల్లంపల్లి ఏరియా కార్మికుల తీర్పు మాత్రం విలక్షణంగా ఉంటుంది. సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు హోదా దక్కించుకున్న కార్మిక సంఘం బెల్లంపల్లి ఏరియాలో మాత్రం ఓడిపోయేది. అయితే గత ఎన్నికల్లో మాత్రం సంప్రదాయానికి భిన్నంగా సింగరేణిలో, బెల్లంపల్లి ఏరియాలో టీబీజీకేఎస్ గెలిచింది. అయితే ఈసారి ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో అని కార్మికులతో పాటు ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత సంప్రదాయన్ని కొనసాగిస్తారా లేక.. గత ఎన్నికల్లో మాదిరిగా గుర్తింపు సంఘంగా ఎన్నికైన సంఘమే బెల్లంపల్లి ఏరియాలో గెలుస్తుందా.. అనేది తెలియాలంటే మరో రెండు రోజులు వేచి చూడక తప్పదు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



సీఎస్ఐ చర్చిలో వేడుకలు



వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారి

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతి, సౌభ్రాతృత్వం, కరుణ, క్షమాగుణం నేర్పించే క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, రాజంపేట, సందీప్‌నగర్ సీఎస్ఐ చర్చి, జన్కాపూర్, గుండి రోడ్, ఎన్జీవోస్ కాలనీ, బజార్‌వాడీ కాలనీల్లోని చర్చిల్లో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దస్నాపూర్ న్యూలైఫ్ చర్చిలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి చిన్నారులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విక్రమ్, చర్చి ప్రతినిధులు పుష్పలత, రాజేశ్వరి, గంటా రాజ్‌కుమార్, జయరాజ్, కరుణకుమార్, సల్మాన్‌రాజ్, సదానందం, నాయకులు అలీబిన్ అహ్మద్, సాయి శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'హక్కుల సాధనకు అవకాశం ఇవ్వండి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికుల హక్కుల సాధనకు ఈ సారి కార్మికులు బీఎంఎస్‌కు అవకాశం ఇవ్వాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్, ఖైరిగూడ ఓసీపీల్లో సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడారు. సింగరేణి, కార్మిక లోకానికి బీఎంఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్మికుల ఆంకాక్షలకు అనుగుణంగా బీఎంఎస్ పని చేస్తుందన్నారు. ఇన్‌కం ట్యాక్స్ రీయింబర్స్‌మెంట్, కేంద్రీయ విద్యాలయాలు, ఆస్పత్రుల నిర్మాణాల కోసం బీఎంఎస్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్న కార్మిక సంఘాలను నమ్మొద్దన్నారు. మెరుగైన వేజ్‌బోర్డు సాధనలో బీఎంఎస్ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ కేంద్ర కార్యవర్గ సభ్యులు పులి రాజిరెడ్డి, బీజేపీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ కొలిపాక కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు చక్రపాణి, సునీల్, జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ, నాయకులు అంబేద్కర్, మల్లికార్జున్ రాంబాబు, రవినాయక్, రాజేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళపై పిచ్చికుక్క దాడి


గాయాల పాలైన సుక్రుబాయి

బెజ్జూర్(సిర్పూర్): పిచ్చికుక్క దాడిలో మహిళకు గాయాలైన ఘటన కుకుడలో చోటు చేసుకుంది. మండలంలోని కుకుడ గ్రామానికి చెందిన సడమేక సుక్రుబాయి సోమవారం కోర్తేగూడ గ్రామ సమీపంలోని పత్తి చేనుకు పత్తి ఏరేందుకు వెళ్తుండగా పిచ్చికుక్క దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌కు తరలించారు.

పురుగుల మందుతాగి యువకుడు బలవన్మరణం


శంకర్(ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: పురుగుల మందుతాగి యువకుడు బలవన్మరణం పొందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన ఇటాంకర్ శంకర్ (22) సోమవారం తమ పత్తి చేనులో గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం మంచిర్యాలకు రెఫర్ చేశారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. యువకుని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. కుటుంభ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

శేజల్ కారుపై రాళ్లతో దాడి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలో ఆరిజిన్ డెయిరీ సీఈవో బోడపాటి శేజల్ కారుపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేశారు. బాధితురాలి కథనం ప్రకారం... డెయిరీ సీఈవో ఆదినారాయణతో కలిసి కారులో వెళ్తుండగా బెల్లంపల్లి–తాండూర్ మార్గమధ్యలో ఉన్న తిరుమల హిల్స్ ప్రాంతంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు ఆకస్మికంగా కారుపై రాళ్లు విసిరారు. ఈ ఘటనలో కారు అద్దం ధ్వంసమైంది. ఈ ఘటనపై బాధితురాలు తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉండే సింగరి సుమేష్, అజయ్‌లు ఆదివారం రాత్రి క్వార్టర్స్ ఆవరణలో కూర్చొని ఉన్నారు. అదే కాలనీకి చెందిన విశ్వజిత్ అనే వ్యక్తి ఇక్కడ ఎందుకు కూర్చున్నారని దుర్భాషలాడి వారిపై దాడి చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అశోక్ తెలిపారు.

పోస్టుమార్టానికి పాట్లు!

- రోడ్డు విస్తరణలో సగానికి కోల్పోయిన మార్చురీ గది
- శవాగారంలో కానరాని బాడీ ఫ్రీజర్స్
- ఏసీ సౌకర్యం ఎరుగని వైనం
- కష్టతరమవుతున్న మృతదేహాల భద్రత
- పట్టించుకోని పాలకులు, అధికారులు


బెల్లంపల్లిలోని మార్చురీ గది

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మార్చురీ గది నిర్వహణ కొరవడడంతో అధ్వానంగా తయారైంది. సరైన వసతి, సౌకర్యాలు లేక మృతదేహాలను భద్రపర్చలేని దుస్థితి. పోస్టుమార్టం నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కనీస సదుపాయాలు లేక మార్చురీ సమస్యలకు నిలయంగా మారింది. దశాబ్దాలుగా తీవ్ర నిరాదరణకు గురవుతోంది. సదుపాయాల కల్పనలో అంతులేని నిర్లక్ష్యం జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు విస్తరణలో...

జాతీయ రహదారి విస్తరణ మార్చురీ గదికి శాపమైంది. హైదరాబాద్–చంద్రపూర్ జాతీయ రహదారి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ముందు నుంచి వెళ్తోంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మార్చురీ గది సగం వరకు కోల్పోవాల్సి వచ్చింది. ప్రహరీని పూర్తిస్థాయిలో పడగొట్టారు. ఈ పరిణామాల క్రమంలో గది అనివార్యంగా రోడ్డెక్కింది. జాతీయరహదారికి అనుబంధంగా ఏర్పాటు చేసిన సర్వీసు రోడ్డు భూభాగంలోకి వచ్చేసింది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో ఆరుబయటే మృతదేహాలకు పోస్టుమార్టం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధమని తెలిసినా పట్టింపులేని ధోరణి ప్రదర్శిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పడిపోతున్న ప్రహరీ

ఏరియా ఆస్పత్రికి దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రహరీ క్రమంగా కూల్చివేతకు గురై ఆనవాళ్లు లేకుండా పోతోంది. ప్రస్తుతం ఆస్పత్రి ముందు భాగంలో ఉన్న ప్రహరీ జాతీయ రహదారి విస్తరణలో కూల్చివేతకు గురైంది. పాత భవనం పక్కనున్న ప్రహరీని రాకపోకలు సాగించడానికి వీలుగా కొందరు పడగొట్టారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో మూగజీవులు సంచరిస్తున్నాయి. ప్రహరీని పునర్నిర్మించాల్సి ఉండగా పట్టింపులేని ధోరణి ప్రదర్శిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపాం

జాతీయ రహదారి విస్తరణలో మార్చురీ గది సగం వరకు కోల్పోవాల్సి వచ్చింది. దీంతో పోస్టుమార్టం చేయడానికి ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. కొత్త గది నిర్మాణానికి, మార్చురీలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం, కూల్చివేతకు గురైన ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు నాలుగు నెలల క్రితం ప్రతిపాదనలు పంపాం. ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. ఎమ్మెల్యే వినోద్ దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– డాక్టర్ జీ.రవి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, బెల్లంపల్లి

మృతదేహాల స్టోరేజీ ఏదీ?

పోస్టుమార్టం గదిలో మృతదేహాలను భద్రపర్చడానికి కనీసం నాలుగైదు బాడీఫ్రీజర్లు అందుబాటులో ఉంచాల్సి ఉండగా బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. నెలకు గరిష్ఠంగా 20 వరకు మృతదేహాలు బెల్లంపల్లి మార్చురీకి వస్తుంటాయి. రైలు, రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలను కొన్నిరోజుల పాటు మార్చురీలో భద్రపర్చాల్సి ఉంటుంది. ఒక్కోసారి రెండు, మూడు వరకు గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలు వస్తుంటాయి. వీటిని భద్రపర్చడానికి బాడీఫ్రీజర్లు అవసరం. అవి లేకపోవడంతో మృతదేహాలు కుళ్లిపోయి దుర్వాసన వేసిన ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, పాలకులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మార్చురీలో ఏసీ, ఇతర సౌకర్యాలు కల్పించడంలో బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా మృతదేహాల నుంచి వెలికి తీసిన ఆర్గాన్స్‌ను భద్రపర్చడానికి పోస్టుమార్టం గదికి అనుబంధంగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆఊసే లేకుండా పోయింది.

ఐఎన్టీయూసీ జనరల్ సెక్రెటరీగా సూర్యనారాయణ


మిట్ట సూర్యనారాయణ

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి ఏరియాకు చెందిన మిట్ట సూర్యనారాయణను ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ జనరల్ సెక్రెటరీగా నియమిస్తూ ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ సింగరేణిలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

పోలీసులు అంకితభావంతో పనిచేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ సదయ్య

కాసిపేట: పోలీసు సిబ్బంది అంకిత భావంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య సూచించారు. సోమవారం మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే తనిఖీ చేయాలన్నారు. పెట్టిన కేసులకు కోర్టు ద్వారా అనుమతి తీసుకుని చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయాలన్నారు. ఆర్థిక నేరాల కట్టడికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్


కాసిపేట గనిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

కాసిపేట(బెల్లంపల్లి): సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్టీయూసీతోనే సాధ్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం మందమర్రి ఏరియా కాసిపేట, కాసిపేట 2గనులపై ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపిస్తే కార్మికుల హక్కుల సాధనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, సెంట్రల్ కమిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సిద్దంశెట్టి రాజమౌళి, సెంట్రల్ కమిటీ సెక్రటరీ రాపర్తి శ్రీనివాస్, నాయకులు కారుకూరి రాంచందర్, బండి ప్రభాకర్, రవీందర్, సిద్దం తిరుపతి, సామల లక్ష్మణ్, నస్పూరి నర్సింగ్, మాజీ జెడ్పీటీసీ రాతు సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి


కేకే–5 గనిపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మందమర్రిరూరల్(చెన్నూర్): సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్టీయూసీని భారీ మెజార్టీతో గెలిపించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కోరారు. సోమవారం మందమర్రి ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్లపై ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కేకే–5 గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన గనుల ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విజన్‌తో ఉందన్నారు. గత ప్రభుత్వం బకాయి పడిన 29 వేల కోట్లు దఫాల వారీగా చెల్లించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు టీబీజీకేఎస్, ఇతర యూనియన్లకు చెందిన నాయకులు ఐఎన్టీయూసీలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

నూతన బొగ్గుగనులు ఏర్పాటు చేస్తాం

రామకృష్ణాపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ ఐఎన్టీయూసీని గెలిపిస్తే నూతన బొగ్గు గనులు ఏర్పాటుచేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీ, ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌పీలలో సోమవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థను ఎట్టి పరిస్థితిల్లోనూ ప్రైవేటుపరం కానివ్వమని, ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికవర్గానికి అన్ని విధాలుగా అండగా ఉంటారన్నారు. ప్రభుత్వ అనుబంధ సంఘాన్ని గెలిపిస్తే కార్మికుల సమస్యలు పరిష్కరించే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, తేజావత్ రాంబాబు పాల్గొన్నారు.

ప్రచారం బంద్.. ప్రలోభాలు షురూ

- క్వార్టర్లు, బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ మొదలు పెట్టిన ప్రధాన కార్మిక సంఘాలు
- యూత్‌కు పెద్దపీట
- నేడు చివరి రోజు.. మరింత జోరు




శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారం ముగిసింది. 27న ఎన్నికలు ఉండడంతో నియమావళి ప్రకారం సోమవారం సాయంత్రం 5 గంటల వరకే కార్మిక సంఘాలు ప్రచారం ముగించాయి. ప్రధానంగా రెండు జాతీయ సంఘాలు ఈ సారి ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో ప్రలోభాలకు తెరలేపాయి. శ్రీరాంపూర్ లాంటి పెద్ద ఏరియాలో మెజార్టీ వస్తేనే గుర్తింపు కైవసం చేసుకోవచ్చని నాయకులు ఇక్కడే తిష్టవేసి కార్మికులను తమవైపు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే గని పిట్ కమిటీ నేతలు వారి క్యాడర్, సానుభూతి పరులైన కార్మికులు, తటస్థ కార్మికులను సమీకరించి వారిని విందులతో ముంచెత్తారు. ఒక సంఘం నాయకులు మద్యం బాటిళ్లను అందిస్తే, మరో సంఘం గనుల పైనే మేకలు కోసి విందులు ఏర్పాటు చేసింది. బ్యాచ్‌ల వారీగా గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారాలు నడిపించారు. కొన్ని గనులపై డ్యూటీ చేసి పైకి వచ్చిన వారికి బిర్యాని ప్యాకెట్లు అందించారు. ఈ రెండు సంఘాలు ప్రధానంగా యూత్ ఓట్లను టార్గెట్ చేశాయి. డివిజన్ కమిటీ నేతలు ఎప్పటికప్పుడు పిట్ కమిటీ నాయకులను సమన్వయం చేస్తూ గనుల వారీగా పంపకాలు చేస్తున్నారు. యూనియన్ వ్యవహారాల్లో యాక్టివ్‌గా తిరిగే వారికి కూడా సిట్టింగ్‌లు చేసి మద్యం, మందులతో విందులు ఇస్తూ వారిని ఉత్తేజపరుస్తున్నారు. గెలిస్తే పిట్ కమిటీ, డివిజన్ కమిటీల్లో కీలక పదవులు వస్తాయని ఆశపడుతున్న నేతలు కొందరు ఈ విందులకు తమ సొంతడబ్బులు పెట్టి కార్మికులను తమ వైపు తిప్పుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం ఎన్నికలు కావడంతో కార్మికులను ప్రసన్నం చేసుకోవడానికి ఈ ఒక్కరోజే మిగిలింది. ఈ రోజంతా విందుల జాతరే జరగనుంది.

గత ఎన్నికలతో పోల్చితే తక్కువే..

ఇదిలా ఉంటే క్రితంసారి గుర్తింపు సంఘం ఎన్నికలతో పోల్చితే ఈసారి మందు, విందులు తక్కువగానే కనిపిస్తున్నాయి. అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా టీబీజీకేఎస్ నేతలు విచ్చల విడిగా ఖర్చు చేశారు. వారం ముందు నుంచే ఫంక్షన్‌హాళ్లలో మీటింగ్‌లు పెట్టి మద్యం, మాంసంతో విందులు ఇచ్చారు. ఆ ఎన్నికల సమయంలోనే దసరా రావడంతో ఏకంగా లారీ లోడ్ మేకలు తెప్పించి గ్యాంగ్‌ల వారీగా పంపిణీ చేశారు. ఇంత చేసిన ఈ సంఘంలో నేడు నాయకత్వ సంక్షోభం వల్ల కార్యకర్తలకు టిఫిన్లు చేయించలేని పరిస్థితి ఏర్పడిందని ఓ బ్రాంచి నాయకుడు తెలిపారు. ఇదిలా ఉంటే క్రితం సారిలా అడ్డగోలు విందుల వ్యవహారాలు ఈసారిలేవని కొందరు కార్మిక సంఘాల నేతలే పేర్కొంటున్నారు.

'పెన్షన్ పెంపునకు కృషి చేయాలి'



లేఖ విడుదల చేస్తున్న వెంకటయ్య

నస్పూర్: సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ పెంపునకు జాతీయ, ప్రాంతీయ సంఘాలు కృషి చేయాలని తెలంగాణ సంఘం జిల్లా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య కోరారు. సోమవారం నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో సంఘం నాయకులతో కలిసి పలు డిమాండ్లతో కూడిన బహిరంగ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో 1998 నుంచి నేటి వరకు ఒక్కసారి కూడా పెన్షన్ పెంచలేదన్నారు. ప్రతీ మూడేళ్లకోసారి రివ్యూ చేసి పెన్షన్ పెంపుదలపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టలేదన్నారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు రాళ్లబండి రాజన్న, ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, కార్యదర్శి కే.రాజన్నగౌడ్, నాయకులు శంకర్‌రావు, పోత విఘ్నేష్, మనోహర్‌రావు, కే.రవీందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'వైద్యుల సమస్యలపై పోరాటం చేస్తాం'



మాట్లాడుతున్న యెగ్గన శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: వైద్యుల సమస్యలపై పోరాటం చేస్తామని, నకిలీ వైద్యులు, వైద్యంకు సంబంధం లేని వారిచే ఏర్పాటు చేసే ఆస్పత్రులపై కమిటీ ద్వారా చర్యలు తీసుకుంటామని డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 ఏళ్లుగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి(టీఎస్ఎంసీ)కి ఎన్నికలు లేకపోవడంతో తమ ప్యానెల్ హెచ్‌ఆర్‌డీఏ పోరాటం చేసి హైకోర్టు, సుప్రీంకోర్టులలో ఉన్న కేసులను గెలిచి ఎన్నికల వరకు వెళ్లిందన్నారు. 42 వేల మంది ఓటర్లుగా వైద్యులు ఉండగా ఎన్నికల్లో 13 మంది హెచ్‌ఆర్‌డీఏ ప్యానెల్ అత్యధిక మెజార్టీతో ఘనవిజయం సాధించిందన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి హెచ్‌ఆర్‌డీఏ సభ్యుడిగా ఎన్నిక కావడం ఆనందంగా ఉందని, తమ ప్యానెల్ ఆధ్వర్యంలోనే టీఎస్ఎంసీ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. వైద్యులు విశ్వేశ్వర్, అనిల్, సురేశ్ పాల్గొన్నారు.

బీఎంఎస్‌ను గెలిపిస్తే కొత్త గనులు తెస్తాం

- యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్‌ను గెలిపిస్తే నూతన భూగర్భ గనులను తీసుకొస్తామని, తద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆ యూనియన్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. సోమవారం ఆర్కే 5 గనిపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సింగరేణి కార్మికులకు న్యాయం జరగాలంటే బీఎంఎస్ గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వేజ్ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు పులి రాజారెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాసెట్టి నాగేశ్వరరావు, రాజేందర్, వసంతరావు, భీమయ్య, చంద్రశేఖర్ పురుషోత్తమచారి, కాంపల్లి తిరుపతి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలపై సమీక్షా సమావేశం


మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం(కార్పొరేట్) గురువయ్య

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో గల కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రక్షణ చర్యలపై జీఎం మనోహర్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సేఫ్టీ జీఎం(కార్పొరేట్) గురువయ్య హాజరై ఏరియాలోని గనుల్లో విధి నిర్వహణలో తీసుకుంటున్న రక్షణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతుండడంతో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించాలన్నారు. సమావేశంలో బెల్లంపల్లి రీజనల్ సేఫ్టీ ఏజీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఏరియా ఎస్వోటూ జీఎం రాజేశ్వర రెడ్డి, ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏఎస్వో రవీందర్, ఐఈడీ రాజన్న, ఏజెంట్లు రామదాసు, విజయప్రసాద్, ఏరియాలోని అన్ని గనుల మేనేజర్లు పాల్గొన్నారు.

జీపీల అభివృద్ధికి నిధులేవి?

- పంచాయతీలపై గత ప్రభుత్వం శీతకన్ను
- అప్పులు తెచ్చి మరీ పనులు చేసిన సర్పంచులు
- ఫిబ్రవరి 1తో ముగియనున్న పదవీకాలం


హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. గ్రామాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని జాతిపిత మహాత్మా గాంధీ మాటను గత పాలకులు పెడచెవిన పెట్టారు. పంచాయతీ పాలకవర్గాలు 2019 ఫిబ్రవరి 2న పదవీ బాధ్యతలు చేపట్టాయి. కొంతకాలం వరకు సర్పంచులకు చెక్ పవర్ ఇవ్వక పోగా దాదాపు రెండేళ్ల పాటు అరకొర నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాలం వెల్లదీయడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. మరోవైపు కొందరు సర్పంచులు అప్పులు చేసి మరీ చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు కూడా గత ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో కేంద్రం ఇచ్చే పన్నులు, గ్రాంట్లపై ఆధారపడ్డారు. పారిశుద్ధ్య పనులు, తాగునీరు, వీధిదీపాల నిర్వహణకు కేంద్ర నిధులు వెచ్చిస్తూ ఎలాగోలా నెట్టుకొచ్చారు. కేంద్రం గ్రాంట్ రెండు, మూడు నెలలకోసారి రావడం, అందులో నుంచి విద్యుత్ బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం మినహాయించుకోవడం సర్పంచులకు తలనొప్పిగా మారింది.

జిల్లాలో 311 గ్రామ పంచాయతీలు

జిల్లా వ్యాప్తంగా 311 గ్రామ పంచాయతీల సర్పంచులు రెండేళ్లుగా నిధుల కోసం ఎదురు చూస్తున్నారు. రూ.10 లక్షల వరకు ఖర్చుపెట్టి మరీ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పాలకవర్గాల పదవీ కాలం వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న ముగియనుండగా ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. కొత్త ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సముఖంగా ఉంటుందా? లేదా పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్ పాలనకు మొగ్గు చూపుతుందా? అనేది తెలియాల్సి ఉంది. ఏది ఏమైనా నూతన ప్రభుత్వంలోనైనా తమ బిల్లులు మంజూరవుతాయా లేదా అన్న ఆందోళన సర్పంచుల్లో నెలకొంది.


బిల్లులు పాస్ కావడం లేదు..



పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పాస్ కావడం లేదు. ఎలాంటి నిధులు రాక జీపీల్లో అభివృద్ధి కుంటుపడింది. పూర్తి చేసిన పనులకు సంబంధించి ఎంబీలు చేసి ఉన్నా, పలు బిల్లులను ట్రెజరీలకు పంపితే మంజూరుకావడం లేదు. అప్పులు చేసి పనులు చేపడితే బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం. మరో నెల రోజుల్లో మా పదవీ కాలం పూర్తవుతుంది. బిల్లులు పాస్ చేస్తే సర్పంచ్‌గా గౌరవంగా దిగిపోతాం.

– జూపాక రాజేశ్వరి, సర్పంచ్, హాజీపూర్

చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న ఏఎస్పీ

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలోని పలు మండలాల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్టు చేసి సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) అచ్చేశ్వర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌కు చెందిన కదారి శ్రీధర్, దివిటీ పోచయ్య, బాణాల శ్రీధర్, షేక్ రహీం, బాణాల నాగేష్, రెబ్బెన మండలంలోని ఎడవెల్లికి చెందిన అత్రం తిరుపతి, కమ్మరి మహేష్, కమ్మరి విజయ్ ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. చోరీ చేసిన వస్తువులను కాగజ్‌నగర్‌లోని షేక్ యాకూబ్, ఆసిఫాబాద్‌లోని కదారి శ్రీనివాస్‌కు విక్రయించేవారు. సోమవారం తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కదారి శ్రీధర్, దివిటీ పోచయ్య, బాణాల శ్రీధర్ ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా పాత ఇనుప సామానుతో పాటు చోరీల కోసం ఉపయోగించే పరికరాలు లభ్యమయ్యాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ముఠా గుట్టురట్టు అయినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి 163 కిలోల రాగితీగ, ఒక ట్రాలీ ఆటో, రెండు బైక్‌లు, 7 సెల్‌ఫోన్‌లతో పాటు చోరీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఆసిఫాబాద్‌లో 6, రెబ్బెనలో 4, తిర్యాణిలో 1, ఈజ్‌గాంలో 2, కాగజ్‌నగర్(రూరల్) 1, సిర్పూర్(టి) 2, చింతలమానెపల్లిలో 1 చొప్పున కేసులు నమోదయ్యాయన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటరమణ, రెబ్బెన సీఐ నరేందర్, ఎస్సైలు చంద్రశేఖర్, రమేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.